# డాంకీ అంకుల్

గాడిదలకు కేంద్రబిందువు కర్నూలు! దేశం మొత్తంలో వున్న గాడిదల సంఖ్యలో సగం కర్నూలులోనే వున్నయ్. డౌటే లేదు.

గాడిదకు గొప్ప చరిత్ర వుంది! వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకున్నాడని భాగవతంలో ఉదహరించటంతో దాని ప్రాముఖ్యత పెరిగి పూజనీయమైంది. క్రీస్తు ప్రభువును గార్ధభంపైనే ఊరేగించటం కద్దు!

వెధవపనులు చేసిన వాళ్లని పూర్వం గాడిదమీద వూరేగించి అవమానించటం కద్దు!

అంకుల్ పుట్టింది గడిదలకు నిలయమైన కర్నూలు! పసితనంలో వాటిని చూచి పకపకా నవ్వేవాడు. వయసు పెరిగేకొద్దీ వాటిని మచ్చికచేసుకోనారంభించాడు అంకుల్ అప్పలనరసయ్య !

ఇతగాడు గాడిదల సావాసం మరిగి వాటి సై స్వారి చేస్తూ తానో ఏనుగ మీదనో... గుర్రం మీదనో స్వైర విహారం చేస్తున్నట్టు ఖుషీ ఫీలయ్యేవాడు కుర్రతనంలతో!

గాడిదల కంపు భరించలేరెవరూ! అయినా అప్పలనరసయ్య వాటిని సమీపించేసరికి ఇంపోర్టెడ్ సెంటు వాసన ఆఘ్రాణిస్తున్నట్టన్పించేది!

'ఓరి పిచ్చి వెధవా... గాడిదల జోలికి పోకురా అవి కెనక్కాళ్లతో తన్నాయంటే మూతి పళ్లు రాలగలవ్...' అని బామ్మ మొత్తుకుంటున్నా 'అవి నన్నేంచేయవులే బామ్మా...' అవి నా నేస్తాలు అనేవాడు.

క్రితం జన్మలో నువ్వు గాడివైయుంటావేమోరా... అందుకకే అవంటే నీకు అంత ప్రీతి' అంటూ నవ్వేసేది బామ్మ బోసి నోటితో!

ఎందరు ఎన్ని రకాలుగ ఎగతాళి చేసినా అప్పలనరసయ్య గార్ధభాలతో స్నేహం... దోస్తి మాన్లేదు. బళ్లోకెళ్లి నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకోమని పంపితే.. బడి ఎగ్గొట్టి గాడిదల గుంపుతో కాలక్షేపం చేసి ఇంటికొచ్చేవాడు. గోపాలుడు ఆవులమంద మధ్యన కాలంక్షేపం చేసినట్టు!

ఇలా చేస్తున్నాడని తెలిసి డాడీ 'బడితె పూజ' చేశాడు ఒకరోజున అప్పలనరసయ్యకు. అయినా బుద్ధి మారితేనా? చదువెట్లాగూ అబ్బేట్టులేదని గ్రహిచి... బడి మాన్పించారు. ఇంటిపట్టున వుంటేనైనా గాడిదలతో సహచర్యం తప్పించవచ్చనే భావనతో.

'ఒరే అడ్డగాడిదా... బడికెళ్లటం తప్పినందుకు పళ్లికిలించకు!. చదుకువుంటే... మంచి వుద్యోగం చేయచ్చు. డబ్బు సంపాదించచ్చు! పేరు ప్రతిష్ఠలు అబ్బుకోవచ్చు...'

శ్రీకృష్ణుడు ఏ చెట్టునీడనో ఆవుల మంద మధ్య నిలిచి మురళి వాయిస్తూ తన్మయత్వం చెందినట్టు... అప్పలనరసయ్య గాడిదల గుంపు మధ్యలో నిలిచి అవి అతి భయంకరంగ ఓండ్ర పెడుతూంంటే పరమానంద భరితుడయ్యేవాడు.

'ఇదిగో కోడలా... మనమిక వాడిని ఏమనీ ప్రయోజనం వుండదు. వాడినేమనద్దు! వాడి తలరాత ఎట్లావుంటే అట్లా బుద్ధిపుడుతుంది వాడికి! ఒక్కగానొక్క మగ నలుసాయె. లేకలేక కల్గిన వంశోద్ధారకుడైన నరిసిగాడిని కోప్పడద్దు...' బామ్మ నచ్చచెప్పేది.

'ముప్పొద్దులా మెక్కటం... గాడిదల వెంట తిరగటం! ఇలాంటి పోరంబోకు గాడిదకు తిండిపెట్టటం కూడా దండగే... ఎండగడితే తిక్కకుదురుతుంది...' అంది తల్లి.

'ఇదిగో సరసూ! కన్నతల్లివై యుండి అంత కటువుగా మాట్లాడకే! అది నరిసిగాడికి ఆయుక్షీణం... మన సంపద అంతటికీ వాడొక్కడే వారసుడు... ఆవిషయం మర్చిపోతున్నావ్...' అనటంతో బామ్మ చీవాట్లు భరించలేక నోరు ఠక్కున మూసింది సరస్వతి!

ఒకప్పుడు రాష్ట్ర రాజధాని కర్నూలనుకున్నారు. కానీ నాయకులలో మార్పొచ్చి... గాడిదలకు భయపడోఏమో... హైదరాబాద్ తరలించారు.

X XX

యుక్త వయసొచ్చి మూతిమీద మీసాలు మొలిచాక్కూడా అప్పలనరసయ్య మిత్ర బృందమంతా అసలు పేరున పిలవకుండా ... గాడిదలతో కాలక్షేపం చేసేవాడు కాబట్టి 'డాంకీ అంకుల్ అనే పిలుస్తుంటే తెగ సంబరపడటం అలవాటైంది. పెద్ద

చిన్నా అందరూ డాంకీ అంకులనే అనటం ఇంట్లో వాళ్లకి కంటగింపుగా వున్నా... అలా పిలిచేవాళ్ల నోళ్లు మూయించలేకపోవటాన సైలెంటైపోయాడు.

ఒకానొక రోజున గాడిదల వెంట వూరి చివరికి షైర్ వెళ్లిన అప్పలనరసయ్యా వురఫ్ డాంకీ అంకుల్‌కు ఒక బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

గాడిద 'లద్దె' వ్యాపారం గిట్టుబాటుగా లేనందున... వాటి సంఖ్యను పెంచాలనే ఆలోచన వచ్చింది.

కోళ్లఫారమ్ పెట్టినట్టు గాడిదల పెంపకానికి ప్రత్యేకించి ఓ ఫారం నడిమి వాటి సంతానోత్పత్తిని గణనీయంగ పెంచి ఇతర రాష్ట్రాలకు... విదేశాలకు ఎగుమతి చేస్తే బోలెడంత ఆర్జించవచ్చు అనే నిర్ణయానికొచ్చి... కర్నూలు శివారు ప్రాంతంలో గల వందెకరాల బీడు భూమిలో ఒకవంతు గాడిదల ఫారమ్ ప్రారంభించటానికి తీసుకుంటానంటూ తండ్రితో చెప్పాడు.

ఆ మాట విన్న తండ్రి ఎగతాళిగా నవ్వాడు. డాంకీ అంకుల్‌కి కోపం వచ్చింది.

'గాడిదలకేం తెలుసు గంధం వాసన అనుకోకండి డాడీ ! వాటితో వ్యాపారం చేసి కోట్లు గడిస్తాను చూస్తూండండి!. పొలం చుట్టూ కంచె వేయించటానికి... షెడ్లు వేయించటానికి ఓ పదిలక్షలిటుపారేయండి. తర్వాత రెండేళ్లాగి చూడండి.... నా వింత విచిత్ర వ్యాపార విన్యాసం ఎలావుంటుందో?' అంటూ మీసం దువ్వాడు.

ఇలాంటి బిజినెస్ ఎవరూ ఎక్కడా చేస్తున్న దాఖలాలు కన్పించకపోవటంతో... కొడుకు వ్యాపారం చేసి బాగుపడితే చాలనుకున్నాడో ఏమో కొడుకు నూతన ప్రతిపాదనకు తలూపాడు తండ్రి. అడినంత ఇచ్చాడు!. అభివృద్ధిలోకి రమ్మని దీవించాడు.

'నీ గాడిదల వ్యాపారం కోట్ల సంఖ్యలో పెరిగి నువ్వు కోటానుకోట్లు ఆర్జించాలని పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలనీ ఆశీర్వదించారు ఇంట్లో ఇతర పెద్దలంతా ముక్తకంఠంతో కోరస్ పాడారు.

X X X

కాలక్రమేణ గార్దభాల సంఖ్య బాగా వృద్ధిచెందింది. ఆఫీసు నెలకొల్పాడు. స్టాఫ్‌ను నియమించాడు. గాడిదలకు దాణా... నీరు... సమకూర్చటంతో పాటు వాటిని రోజూ

కడిగి శుభ్రం చేయటానికి కూడా కూలీలను నియమించాడు.

వాటి పాలు అమ్ముతున్నాడు. సీలర్డ్ టిన్స్‌లో ఇతర రాష్ట్రాలకు పంపుతున్నాడు.

పర్వత ప్రాంతాల నుండి తమకు అధిక సంఖ్యలో గాడిదలు కావాలంటూ ఆయా రాష్ట్రాల వారు కోరుతుంటే వాటిని గూడ్సు వ్యాగెన్స్‌లో... లారీల్లో తరలిస్తున్నాడు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇతర ప్రాంతాలలో వుండే గాడిదలను తానొక్కడే కొనేశాడు. గాడిదలను కొనటమేమిటి? అధిక సంఖ్యలో అమ్మటమేమిటని అంతా ముక్కున వేలేసుకోవటేమే!

తన ఆలోచన... ప్రయత్నం సఫలమైనందుకు అధిక సంఖ్యలో సప్లై చేయమంటూ ఆర్డర్లు వస్తున్నందుకు మురిసిపోతున్నాడు.

కంపెనీ పని కోసం లారీలు... చిన్న కార్లువున్నా డంకీ అంకుల్ మాత్రం కార్పెంటర్స్‌తో సూర్య రథాన్ని పోలిన చెక్కరథాన్ని తయారుచేయించి దాన్ని గుర్రాలకు బదులుగ ఏడు గాడిదలను కట్టి రథంలో తాను కూర్చుని ఇంటి నుండి రోజూ ఆఫీసుకు... తిరిగి ఇల్లు చేరుకోవటానికి వినియోగించుకోవటం కర్నూలు స్థానికులు చూచి మొదట్లో పరిహసించినా ఇలాంటి సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టిన 'డాంకీ అంకుల్' ను అంతా అభినందించసాగారు. ఆలా చేయటం వల్ల ఇంధనం పొదుపు చేయవచ్చని రుజువు చేసినందుకు జిల్లా కలెక్టర్ అప్పలనరసయ్యను మనసారా అభినందించాడు.

ఈ పొదుపు విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి కూడా వెళ్లటంతో ఈ విధమైన ప్రయోగం అద్భుతమంటూ వేనోళ్ల కొనియాడి అప్పలనరసయ్య వురఫ్ 'డాంకీ అంకుల్' ను ఘనంగ సత్కరించారు.

ఎవరైనా... ఎంతటి వారైనా... గాడిదలను కించపర్చి మాట్లాడటం 'డాంకీ అంకుల్' సహించడు.

ఫామ్ హౌస్‌లో గల గాడిదలు రోగాల బారిన పడకుండా వైద్య సదుపాయం కూడా కల్పించటం అవి నిత్య ఆరోగ్యంగ వుండాలని తీసుకునే శ్రద్ధ చూచి పట్టణవాలులు నివ్వెరపోవటం ఒక ఎత్తైతే, ఈ అద్భుతమైన గార్ధభ వ్యాపారాన్ని గురించి ప్వయంగ చూచి వివరాలు సేకరించటానికి ఇతర దేశాల నుండి వ్యాపార సంస్థల వారు విజిట్ చేయటం కూడా మరో ఎత్తు !

అఫ్ఘనిస్తాన్... కాబూల్... లాంటి ఇతరదేశాలకు సైతం గార్ధభాల ఎగుమతి వ్యాపారం నరాటంకంగ కొనసాగుతోంది.

పొట్టపొడిస్తే అక్షరమ్ముక్క రాని అప్పలనరసయ్య గాడిదల వ్యాపారంలో కోట్లు గడిస్తున్నాడంటే అద్భుతమైన అతని తెలివితేటలను... అదృష్టాన్ని కీర్తించనివారు లేరు.

మమ్మీ డాడీలు కొడుక్కి పెళ్లి చేయాలనే ప్రయత్నంలో చక్కని చుక్కల వేట ప్రారంభించారు.

టాటా... అంబానీల సరసన కూర్చోగల ఆర్థికస్తోమతకు ఎదగటంతో పిల్లను మేమిస్తామంటే మేమని పోటీపడసాగేరు. దేశంలో వ్వే కోటీశ్వరులు! 'క్యూ' లు కట్టారు!

'చూశావా బామ్మా ! నన్నందరూ డాంకీ అంకుల్ అంటూ ఎగతాళి చేసినవాళ్లే ఇప్పుడు నాకు బ్రహ్మరథం పడుతున్నారో? దటీజ్ నీ గ్రాండ్ సన్ అప్పలనరసయ్యా అంటూ మీసం మెలేశాడు.

'చూశావా డాడీ! అక్షరంముక్క రానివాడినని నన్ను ఎగతాళి చేశావ్!... చూస్తున్నారుగా నేను వ్యాపారంలో ఎంత ఎత్తుకెదిగానో?...' గర్వంగ మాట్లాడేడు కన్నతండ్రితో.

తాతల నాటి నుండి తండ్రికి వంవపారంపర్యంగ సంక్రమించిన ఆస్తిని 'డాంకీ అంకుల్' వేయిరెట్లు చేయగలిగాడు.

గాడిదలు పనికిమాలినవి... పనికిరానివి కావని నిరూపించిన ఘనత తనకు దక్కింది.

మొత్తానికి ఒక ప్రముఖ వ్యాపారవేత్త ఏకైక కుమార్తెతో 'డాంకీ అంకుల్' కు పెళ్లి ఖాయమైంది.

తనకు కట్నమంటూ అక్కర్లేదని... అయితే మ్యారేజ్ ఫంక్షన్ పూర్తిఅవగానే డజను గాడిదలతో రథం తయారు చేయించి అత్యంత సుందరంగ దాని అలంకరించి నూతన దంపతులిద్దరినీ ఆ రథంలో సిటీ అంతా తిప్పాలనే కండిషన్ పెట్టాడు.

'డజనేం ఖర్మ అల్లుడూ... నూటొక్క గాడిదలతో అత్యంత ఆకర్షణీయమైన అధునాతన పద్ధతులతో చూడముచ్చటగొలిపే రథాన్ని తయారుచేయించి మన స్థాయికేమాత్రం తగ్గనంత శోభాయమానంగ గార్ధభరథంలో మిమ్ములను ఆశీనులను చేసి పూరేగించనూ!?...' అంటూ మామగారు వాగ్దానం చేశాడు.

దేశం నలుమూలలనుంచే కాకుండా దేశవిదేశాలనుండి అనేకమంది సంపన్నులు... వ్యాపారస్తులు కన్నులపడుగ్గా జరిగే వివాహానికి విచ్చేశారు.

గార్ధభాల రథంపై నూతన వధూవరల ఊరేగింపు పెల్లిలో ప్రత్యేక ఆకర్షణ కావటం విశేషం!

అన్ని భాషల టి.వి. ఛానళ్లు 'డాంకీ అంకుల్' వివాహ వేడుకను డైరెక్ట్ లైవ్ టెలికాస్ట్ చేసినయ్.

శోభనం రాత్రి భర్తను 'డియర్ డాంకీ అంకుల్' అంటూ నూతన వధువు మాట్లాడబోగా...' డార్లింగ్ నువ్వు నా అర్ధాంగివి!. అనగా నాలో సగం లేడీ డాంకీవి... అందుచేత నన్నులా పలువటం హిందూ సాంప్రదాయం వప్పుకోదు అని వారంచటంతో పౌర్ణిమ కిలకిలా నవ్వింది. నవ్వులో తనూ శృతి కలిపాడు అప్పలనరసయ్య సోకాల్డ్ డాంకీ అంకుల్ !! -

డాంకీ అంకుల్ పేరు గిన్నీస్ బుక్‌లోకి ఎక్కింది!!

--- సమాప్తం ---